# పొన్నం.. దమ్ముంటే ప్రమాణం చెయ్యి

**మరోసారి సవాల్ విసిరిన కౌశిక్‌రెడ్డి**

- అక్రమాలకు పాల్పడకపోతే నేనే క్షమాపణ చెబుతా
- తాను అవినీతికి పాల్పడలేదని తడివస్త్రాలతో ప్రమాణం
- గృహ నిర్బంధంతో ఇంటి వద్దే ఎమ్మెల్యే ఒట్టు
- కాంగ్రెస్ నేత ప్రణవ్ సవాల్‌కు కౌశిక్‌రెడ్డి స్పందన
- చెల్పూర్‌లో మూడు గంటలపాటు హైడ్రామా
- రెచ్చిపోయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- పోలీసులపై దౌర్జన్యం.. తప్పని లాఠీ చార్జి

కరీంనగర్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్టీపీసీ ఫ్లైయాష్ వివాదంలో నిప్పు రాజుకున్నది. ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విసిరిన ఆరోపణాస్త్రాలు పెద్ద దుమారాన్నే సృష్టించాయి. కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ చేసిన ప్రత్యారోపణలపై దీటుగా స్పందించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని మంగళవారం వీణవంకలోని తన ఇంటిలో పోలీసులు నిర్బంధించారు. ఆయన అక్కడే తడివస్త్రాలతో బహిరంగంగా ప్రమాణం చేశారు. ఇటు సింగపూర్‌లో ప్రణవ్‌ను ఇంటి నుంచి బయటికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ప్రణవ్ ప్రమాణం చేయాలని చెల్పూర్‌కు పెద్దసంఖ్యలో చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోలీసులపై దౌర్జన్యంగా ప్రవర్తించడంతో లాఠీ దెబ్బలు రుచి చూశారు. ఇటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును మానకొండూర్‌లోని తన ఇంటినుంచి బయటికి రాకుండా పోలీసులు నిర్బంధించారు. మూడు గంటలపాటు కొనసాగిన ఈ హైడ్రామా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

### సవాళ్లు - ప్రతిసవాళ్లు

పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ నుంచి ఖమ్మం జిల్లాకు తరలిస్తున్న ఫ్లైయాష్ ఓవర్‌లోడ్ లారీలపై రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పెద్ద ఎత్తున ముడుపులు ముడుతున్నాయని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గతంలో ఆరోపించారు. మంత్రి పొన్నం హైదరాబాద్‌లోని అపోలో వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ స్పందించి మంత్రి పొన్నంపై ఆరోపణలు సరికాదని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్థానికంగా వసూళ్లు చేశాడని, అవినీతికి పాల్పడలేదని హుజూరాబాద్ మండలం చెల్పూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణం చేయాలని ప్రతి సవాల్ విసిరారు. దీనిపై కౌశిక్‌రెడ్డి స్పందిస్తూ మంగళవారం వీణవంకలోని తన ఇంటి నుంచి చెల్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రమాణం చేయడానికి వెళ్తుండగా పోలీసులు అక్కడే నిర్బంధించారు. దీంతో కౌశిక్‌రెడ్డి ఇంట్లోనే స్నానం చేసి తడివస్త్రాలతో మీడియా, పోలీసులు, ప్రజల ఎదుట బహిరంగంగా ప్రమాణం చేశారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తాను నమ్ముకున్న వేంకటేశ్వర స్వామిపై ప్రమాణం చేస్తున్నానని వెల్లడించారు. ఈ వివాదం ఉద్రిక్తతకు దారితీస్తుందని భావించిన పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌ను మాత్రం సింగాపూర్‌లోని ఇంటిలో నిర్బంధించిన పోలీసులు, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఆపలేకపోయారు.



చెల్పూర్ గుడి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న కాంగ్రెస్ నాయకులు

### చెల్పూర్‌లో హైడ్రామా..

హుజూరాబాద్ మండలం చెల్పూర్ ఈ ప్రమాణాల వివాదానికి వేదికైంది. హుజూరాబాద్, జమ్మికుంట ప్రధాన రహదారిలో ఉన్న ఈ గ్రామానికి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రహదారిపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీరంగం సృష్టించడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు బందోబస్తుకు వచ్చిన మహిళాకానిస్టేబుళ్లపై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యం చేయడంతో వారు కిందపడ్డారు. వారిపై మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు బూతుపురాణం మొదలుపెట్టారు. పరిస్థితి అదుపు తప్పుతుందని పోలీసులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జీ చేశారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ రమేశ్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో బందోబస్తు ఉన్నా కాంగ్రెస్ నాయకుల వీరంగం తప్పలేదు. బారికేడ్లను తోసుకుని రహదారిపైకి చేరిన కాంగ్రెస్ నాయకులు మూడు గంటలపాటు నానా హంగామా చేశారు.

### అవినీతి జరగలేదని నిరూపించుకో..

వీణవంకలోని తన ఇంటి వద్ద తడివస్త్రాలతో మీడియా ముందుకు వచ్చిన కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తాను నమ్ముకున్న వెంకటేశ్వరస్వామి కండువా, ఆంజనేయ స్వామి చిత్రపటాలను పట్టుకుని ప్రమాణం చేసి చెబుతున్నానని, తాను ఎవరి వద్ద వసూళ్లకు పాల్పడలేదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలకు తన నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ప్రమాణం చేస్తున్నానని చెప్పారు. బాధ్యతగల ఎమ్మెల్యేగా చెల్పూర్‌కు లా అండ్ ఆర్డర్ సమస్య కావొద్దని పోలీసు చెప్తే ఇంట్లోనే ప్రమాణం చేస్తున్నానని చెప్పారు. ఫ్లైయాష్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల అవినీతికి పాల్పడినట్టు తాను బహిరంగంగానే ఆరోపించినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మంత్రికి మరో అవకాశం ఇస్తున్నానని, తనతో కలిసి హైదరాబాద్ అపోలో వెంకటేశ్వరస్వామి గుడికి రావాలని, రూ.100 కోట్ల అవినీతి చేయలేదని నిరూపిస్తే, తాను బహిరంగ క్షమాపణ చెబుతానని స్పష్టంచేశారు. ఓవర్ లోడ్‌తో ఫ్లైయాష్ లారీలు పోవడంలేదని చెప్పే దమ్ము, ధైర్యం మంత్రికి ఉన్నదా? అని ప్రశ్నించారు. పొన్నం బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. 'ప్రభు త్వం మీదేనని పోలీసులతో నన్ను అరెస్ట్ చేయొద్దని, మీరు అరెస్ట్ కావొద్దని, ఇద్దరమే గుడిలోకి వెళ్లి స్నానం చేసి, తడి బట్టలతో ప్రమాణం చేద్దామని, ఇందుకు సిద్ధమేనా?' అని కౌశిక్‌రెడ్డి సవాల్‌చేశారు. చెల్పూర్ హనుమాన్ ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న జమ్మికుంట ఎస్సైపైకి కాంగ్రెసోళ్లు గూండాల్లాగా వెళ్లారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కాంగ్రెస్ గూండాలపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ సీపీని కౌశిక్‌రెడ్డి కోరారు.

## పింఛన్లు పెంచకుంటే జూలైలో ఉద్యమం

- కేసీఆర్‌తో కలిసి కాంగ్రెస్ సర్కారుపై పోరుబాట
- బీజేపీ, సీపీఐ, సీపీఎంనూ ఆహ్వానిస్తాం
- నెల మొత్తం విడతలవారీగా ఆందోళనలు చేస్తాం
- ఏడు నెలలైనా 'చేయూత' లేదు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, జూన్ 25: చేయూత పథకం కింద సామాజిక పింఛన్ల సొమ్మును బకాయిలతో సహా జూలై 2లోపు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, లేకుంటే మూడు నుంచే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో కలిసి పోరాటానికి దిగుతామని, ఉద్యమంలో భాగస్వాములు కావాలని బీజేపీ, సీపీఐ, సీపీఎంనూ ఆహ్వానిస్తామని తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఏడు నెలల కాలంలో నెలకు రూ.896 కోట్ల చొప్పున సుమారు రూ.6,300 కోట్ల చేయూత పింఛన్ల సొమ్మును ప్రభుత్వం బకాయి పడిందని తేల్చిచెప్పారు. ఎగ్గొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దివ్యాంగులను మోసగించిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందని ఎద్దేవాచేశారు. పింఛన్ల సొమ్మును ప్రభుత్వం పెంచకుంటే జూలై 3న హైదరాబాద్‌లో, 4న అన్ని జిల్లాల్లో రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎంను కలుపుకొని పోతామని, అదేరోజు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి స్వయంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తాను కోరుతానని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావును కలిసి భవిష్యత్తు ఉద్యమానికి ఆహ్వానిస్తామని చెప్పారు. 5న కలెక్టరేట్ల ఎదుట వేలాది మందితో మహాధర్నాలు, 6 నుంచి 16 వరకు కలెక్టరేట్ల ఎదుట దీక్షలకు దిగుతామని చెప్పారు. 17 నుంచి 31వరకు అన్ని మండలాల్లో దీక్షలు, ధర్నాలతో రోడ్ల దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.


## బీఆర్‌ఎస్ ఇచ్చిన ఇండ్లపై కాంగ్రెస్ దౌర్జన్యం



ఇంట్లోని సామగ్రి చిందరవందర చేసిన కాంగ్రెస్ నాయకులు

ఖిలావరంగల్, జూన్ 25: బీఆర్‌ఎస్ ప్రభు త్వం పేదల గుడిసెలకు పట్టాలిస్తే.. నేడు కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. దీంతో వందమంది గుడిసెవాసులు మంగళవారం రాత్రి వరంగల్‌లోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆందోళనకు దిగారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని చింతల్ జ్యోతిబసనగర్‌లో 2007 నుంచి 290 మంది గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత గుడిసె వాసుల కాలనీలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో నాటి సీఎం కేసీఆర్ రోడ్లు, మురుగుదొడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతులు కల్పించారు. జీవో నం. 58, 59 ద్వారా పట్టాలు పంపిణీ చేయడంతో పేదల సొంతింటి కల నెరవేరింది. జ్యోతిబసనగర్‌లో నివాసముంటున్న స్వ రూప, శ్రీలత, రేణుకకు చెందిన ఇండ్లపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కాంగ్రెస్ నాయకులు శివ, నాని తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి సామగ్రిని చెల్లాచెదురు చేసి తాళాలు వేసుకున్నారు. బాధితులకు మద్దతుగా జ్యోతిబసనగర్‌కు చెందిన వందమంది పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు.

### సారంగి నవలకు రాష్ట్రస్థాయి పురస్కారం



రచయిత్రి సీత

కరీంనగర్ కమాన్ చౌరస్తా, జూన్ 25 : జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ ఏటా ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే రాష్ట్రస్థాయి 'రజని శ్రీ సాహిత్య పురస్కారం' 2024కు గాను చుండూరు సీత రచించిన సారంగి నవల ఎంపికైనట్టు పురస్కార కమిటీ కన్వీనర్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్, కోశాధికారి స్తంభంకాడి గంగాధర్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఉభయ రాష్ట్రాల నుంచి 44 నవలలు వచ్చాయని, వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ద ప్రతిష్ఠులైన ముగ్గురు న్యాయ నిర్ణేతల ఎంపిక మేరకు చుండూరు సీత రచించిన సారంగి నవలకు పురస్కారం ప్రకటిస్తున్నట్టు పేర్కొన్నారు. త్వరలో కరీంనగర్‌లో పురస్కారం ప్రదానంతోపాటు నగదు బహుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు.

### ఊయల మెడకు చుట్టుకొని బాలుడి మృతి



అంజన్న (ఫైల్)

చింతలమానేపల్లి, జూన్ 25: చీరతో కట్టిన ఊయలలో ఊగుతుండగా.. అదే చీర మెడకు చుట్టుకొని ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందాలో జరిగింది. దిందాకు చెందిన డగే నారాయణ-కాంతాబాయిలకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు అంజన్న (12) ఉన్నారు. అంజన్న స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లకుండా మధ్యాహ్నం ఇంట్లో చీరతో కట్టిన ఊయలలో ఊగుతుండగా.. చీర అంజన్న మెడకు చుట్టుకుంది. కొద్ది సేపటికి సోదరి ఇంట్లోకి వచ్చి చూడగా తమ్ముడు ఊయలకి చుట్టుకొని ఉండటాన్ని చూసి కేకలు వేసింది. తల్లితోపాటు చుట్టుపక్కల వారు వచ్చి అంజన్నను ఊయల నుంచి బయటకు తీశారు. దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేశ్ తెలిపారు.

# సైనిక్ స్కూల్‌పై రేవంత్‌వి అబద్ధాలు

- స్కూల్‌పై రక్షణశాఖ షరతులు
- నిర్వహించలేమని చేతులెత్తేసింది
- షరతులు సడలించాలని కేసీఆర్ లేఖ
- గోబెల్స్‌ను ఫాలో అవుతున్న రేవంత్
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): సైనిక్ స్కూల్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని, ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సైనిక్ స్కూల్ కోసం గతంలో సీఎంగా కేసీఆర్, ఎంపీలుగా తాము అనేకమార్లు ప్రయత్నించినట్టు తెలిపారు. రక్షణశాఖ ఆధ్వర్యంలో సైనిక్ స్కూల్స్ ఇక ముందు నడపలేమని కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకోవడంతోనే సమస్యలు వచ్చాయని వివరించారు. సైనిక్ స్కూల్‌పై రేవంత్‌రెడ్డి గోబెల్స్ తరహాలో మాట్లాడారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ సైనిక్ స్కూల్ విషయాన్ని కేసీఆర్ పట్టించుకోలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కేంద్రానికి కేసీఆర్ రాసిన ఉత్తరాలు సీఎం కార్యాలయంలోనే ఉంటాయని, వాటిని రేవంత్ ఓసారి చూడాలని సూచించారు. వరంగల్‌లో సైనిక్ స్కూల్‌కు సంబంధించి అప్పటి రక్షణమంత్రి మనోహర్ పారికర్‌ను అనేకసార్లు కలిశామని తెలిపారు. దివంగత అరుణ్ జైట్లీని కూడా బీఆర్‌ఎస్ ఎంపీలుగా చాలాసార్లు కలిశామని తెలిపారు. సైనిక్ స్కూల్‌కు భూమి సహా సిబ్బంది జీతభత్యాలు, రోజువారీ వ్యయం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని రక్షణశాఖ షరతులు విధిస్తే వాటిని సడలించాలని కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారని గుర్తుచేశారు.

### నీట్‌పై రేవంత్ దృష్టిసారించాలి

నీట్ విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్‌రెడ్డి దృష్టిసారించాలని, మంచి న్యాయవాదిని నియమించి సుప్రీంకోర్టులో కొట్లాడాలని వినోద్‌కుమార్ సూచించారు. రాష్ట్రం నుంచి నీట్ రాసిన 1.4 లక్షల మంది తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యపై రేవంత్ అబద్ధాలు మాట్లాడి యువతను రెచ్చగొట్టారని, 2.2 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

### 'పాఠశాల' భూయజమానుల నిరసన

లింగంపేట, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి తమ భూమిని తీసుకున్న అధికారులు.. మరోచోట స్థలాన్ని కేటాయిస్తామని మాట తప్పడంపై బాధితులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లిసంగారెడ్డిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. ఉప్పరి మనెమ్మ, బర్ల భారతమ్మ, గంగామణి, కళావతి, అనుసమ్మ, దుర్గయ్యకు చెందిన 34 గుంటల స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం ఇస్తే, మరోచోట ఐదు గుంటల భూమి ఇస్తామని అధికారులు హామీఇచ్చారు. అందుకు భూ యజమానులు భూమిస్తే ముప్పై ఏండ్ల క్రితం పాఠశాల నిర్మించారు. పక్కనే మరో స్థలం చూపిస్తే సాగుకు అనుకూలంగా లేదని రైతు లు తీసుకోలేదు. ఏండ్లు గడుస్తున్నా భూమి కేటాయించలేదు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో బాధితులు మంగళవారం పాఠశాల ఆవరణలో వంటావార్పుతో నిరసన తెలిపారు.



మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రజనీ సాయిచంద్, బీఆర్‌ఎస్ కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

# రుణమాఫీ చేయకముందే సంబురాలా?

- రైతుల రుణ వివరాలు ప్రకటించాలి
- రైతు భరోసా ఎప్పుడిస్తారో చెప్పాలి
- తెలంగాణ నిరంతర జ్వాల
- బీఆర్‌ఎస్ పుంజుకోవడం ఖాయం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): రైతుల రుణమాఫీ చేయకముందే, క్యాబినెట్ నిర్ణయంపై గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. గ్రామాలు, మండలాల వారీగా రైతులు తీసుకున్న రుణ వివరాలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటి మీద వాలనివ్వనని చెప్పిన రేవంత్.. ఇంటింటికీ తిరిగి కండువాలు కప్పుతున్నాడని అన్నా రు. రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలోనే బీజేపీకి ఆధిక్యం వచ్చిందని, బీజేపీని నిలువరించడంలో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ అంగీకరించిందని చెప్పారు. వైఎస్ హయాంలో ఎంతో మంది ఎమ్మెల్యేలను లాక్కున్నారని, కానీ తెలంగాణను ఆపలేక పోయారని అన్నారు. తెలంగాణ అనేది నిరంతర జ్వాల అని, దాని కోసం తెలంగాణ తెచ్చిన పార్టీగా, పదేండ్లు గొప్పగా పాలించిన పార్టీగా నిరంతరం పోరాడుతామని స్పష్టంచేశారు. నలుగురు ఎమ్మెల్యేలను లాక్కోవడం మూలంగా బీఆర్‌ఎస్ పార్టీని బలహీనపర్చగలమని అనుకుంటే పొరపాటే అవుతందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు నెలలుగా పింఛన్లు ఇవ్వడం లేదని, రైతుభరోసా ఎప్పుడిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. రుణమాఫీకి సంబంధించి రూ.19 వేల కోట్లకు రూ.14 వేల కోట్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని, ఎన్నికల నాటికి మిగిలిపోయిన రైతాంగానికి రుణమాఫీ చేస్తరా..? చేయరా..? ప్రకటించాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐదు ఎకరాలలోపు రైతులకు రూ.2 లక్షల రుణాలు లేవని, ఈ విషయం బ్యాంకు అధికారులే చెబుతున్నారని అన్నారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఉన్న రేషన్ కార్డులను రద్దు చేసే ప్రయత్నాల్లో ఉన్నారని మండిపడ్డారు. మహిళలకు రూ.2500, 4వేల పింఛను, విద్యార్థులకు రూ.5 లక్షల సాయం ఏమయ్యాయని, రాష్ట్రంలోని మేధావులు ప్రభుత్వాన్ని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఖచ్చితంగా పుంజుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రజనీ సాయిచంద్, బీఆర్‌ఎస్ కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లాకో 'ఆర్ట్' సెంటర్

- కొత్తగా మరో 16 కేంద్రాలు
- హెచ్‌ఐవీ రోగులకు మెరుగైన సేవలు అందే అవకాశం

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఐవీపై నిఘాతోపాటు, రోగులకు సేవలు అందించే యాంటీ రిట్రోవైరల్ థెరపీ(ఆర్ట్) కేంద్రాలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 జిల్లాల్లో 26 కేంద్రాలు ఉన్నాయి. మరో 16 జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రభు త్వ మెడికల్ కాలేజీల్లో (ఆర్ట్) కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ఆదేశించడంతో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీశాక్స్) చర్యలు చేపట్టింది. నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, భూపాలపల్లి, సిరిసిల్ల, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, ములుగు, గద్వాల, రంగారెడ్డి, మెదక్, నారాయణపేట, మేడ్చల్ మల్కాజిగిరి, హన్మకొండలో కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పూర్తయిన తర్వాత.. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోనూ ఆర్ట్ కేంద్రాల ఏర్పాటుపై వైద్యారోగ్య శాఖ దృష్టిసారించనున్నది. ప్రస్తుతం ఐదు కాలేజీల్లో కేంద్రాలు ఉండగా.. మిగతా వాటిలోనూ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

### మెగా డీఎస్సీ వేయాలని బీజేవైఎం ధర్నా



కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలని బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణనాయుడు, యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మధు డిమాండ్ చేశారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతూ సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు నారాయణనాయుడు, మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా మెగా డీఎస్సీ వేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. - వనపర్తి టౌన్

### మూడు నెలలుగా జీతాలివ్వరా?



పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం ఉదయం కరీంనగర్ దవాఖాన ఎదుట ధర్నా చేశారు. వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంఘం గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు కార్మికులు రెండు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకో వారం గడిస్తే వేతనాలు రాక మూడు నెలలు అవుతుందని తెలిపారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. - కరీంనగర్ విద్యానగర్



వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న జూడాలు. - కాశీబుగ్గ

## జూడాల సమ్మెను పట్టించుకోని సర్కారు

### ఒక్కరోజుకే పరిమితమైన చర్చలు

హైదరాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఈ సమ్మెను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. సోమవారం చర్చల పేరు తో హడావుడి చేసిన వైద్యారోగ్య శాఖ.. మంగళవారం కనీసం పట్టించుకోలేదు. సోమవారం చర్చలు అసంపూర్తిగా ముగిసిన సంగతి తెలిసిందే. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా జూడాల ప్రతినిధులను మినిస్టర్స్ క్వార్టర్స్‌కు పిలిచి చర్చించారు. కొన్నింటికి మాత్రమే హామీ ఇచ్చి, మరికొన్నింటిని పట్టించుకోలేదు. డీఎంఈతో చర్చలు జరపాలంటూ పంపేశారు. డీఎంఈ దగ్గర కూడా తేలకపోవడంతో చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. వీటికి కొనసాగింపుగా మంగళవారం చర్చలు జరుగుతాయని అందరూ భావించినా, వైద్యారోగ్య శాఖ నుంచి స్పందన కనిపించలేదు. మంత్రి, ఉన్నతాధికారుల నుంచి పిలుపు అందలేదు. జూడాలు గొంతెమ్మ కోరికలు కోరుతున్నారంటూ కొందరు అధికారులు ఉన్నతాధికారులతో చెప్పినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓపీ, ఐపీ సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నా.. జూడాల సమ్మెను లైట్ తీసుకుంటున్నదని విశ్లేషకులు మండిపడుతున్నారు. అవసరమైతే అత్యవసర సేవలనూ బహిష్కరిస్తామని జూడాలు హెచ్చరిస్తున్నారు.

### బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని ధర్నా



రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను గెలిపిస్తే తెలంగాణకు గుండెకాయ లాంటి సింగరేణి గనులను వేలం వేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటంరాజ్ మండిపడ్డారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా గనుల ప్రైవేటీకరణ జరగడం సిగ్గుచేటన్నారు. సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కోతిరాంపూర్ గాంధీ విగ్రహం వద్ద ఆ సంఘం నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటంరాజ్ మాట్లాడుతూ.. సింగరేణి మీద లక్షలాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, ప్రైవేటీకరణతో వారంతా జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. - కరీంనగర్ తెలంగాణచౌక్

## సింగరేణిని ప్రైవేటీకరిస్తే ఊరుకోం: కూనంనేని



కరీంనగర్ రూరల్, జూన్ 25: సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్ర చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. గనులను సింగరేణి ఆధ్వర్యంలోనే నడపాలని, ప్రైవేటీకరణ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణి ప్రైవేటీకరణపై ప్రధాని మోదీ పూటకో మాట మాట్లాడుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రధాని చెబుతున్న అబద్ధాలే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా చెప్పడం దుర్మార్గమని అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను బీజేపీ సర్కార్ తుంగలో తొక్కి రెండు రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలకు తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే విభజన హామీల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.